# 5

# శ్రేష్ఠమైన నిబంధన

## (7:11-8:13)

సహజంగా గొప్ప వాటియందు మనకు ఆసక్తి ఉంటుంది. మనకు గొప్ప ఉద్యోగాలు, గొప్ప ఇళ్ళు, గొప్ప బట్టలు కావాలనుకుంటాము. గొప్ప వాటిని మనం ఆశిస్తాము కాబట్టి హెబ్రీయులకు 8లో ఏం చెప్పబడిందో ఆసక్తిగా గమనించుదాము. (అధ్యాయాన్ని చదవండి.) ప్రత్యేకించి 8:6ను చూడండి:

> ఈయనయైతే ఇప్పుడు మరియెక్కువైన వాగ్దానములనుబట్టి నియమించబడిన మరి యెక్కువైన నిబంధనకు మధ్యవర్తియైయున్నాడు గనుక మరి శ్రేష్ఠమైన సేవకత్వము పొంది యున్నాడు.

యేసుని పరిచర్య "మరి శ్రేష్ఠమైనది," లేదా "గొప్పది." ఆయన్నుబట్టి మనకు "శ్రేష్ఠమైన నిబంధన" ఉంది అది మనకు "గొప్ప వాగ్దానాలను" యిస్తుంది.

హెబ్రీయులకు 8 మరియు ఈ పత్రికలో మనకు కనిపించే ముఖ్య పదం "గొప్ప." క్రీస్తుని విధానం మోషే ధర్మశాస్త్రం కంటే గొప్పది. క్రొత్త నిబంధన గొప్ప నిబంధనను అందిస్తుంది అన్న హెబ్రీ పత్రిక సందేశం. దీని అర్థం ఏమిటి? మన జీవితంలో దీని అర్థం ఏమిటి?

### శ్రేష్ఠమైన నిబంధనను కలిగియుండడం అంటే ఏమిటి?

**ఇది ఏ అర్థం ఇవ్వదు**

క్రొత్త నిబంధన శ్రేష్ఠమైన నిబంధన అని చెప్తున్నప్పుడు వాక్యం యొక్క ఉద్దేశం ఏమిటన్నది గ్రహించుటకు దీని అర్థం ఏమి కాదు అన్న విషయాన్ని గ్రహించాలి.

*ఇది ఒక చెడ్డ చట్టం కాదు.* క్రొత్త నిబంధన శ్రేష్ఠమైనదే, అయితే దీనర్థం పాత నిబంధన చెడ్డది అని కాదు. "శ్రేష్ఠమైనది" అనేది "మంచిది" అను పదం యొక్క క్రియా విశేషణారూపకం. కాబట్టి క్రొత్త నిబంధన "శ్రేష్ఠమైనది" అని చెప్తున్నప్పుడు పాత నిబంధన "మంచిది" అని అర్థమవుతుంది. "ధర్మశాస్త్రము పరిశుద్ధమైనది, ఆజ్ఞకూడ పరిశుద్ధమైనదియు నీతిగలదియు ఉత్తమమైనదియునై యున్నది" (రోమీయులకు 7:12) అని పౌలు మరోచోట చెప్తున్నాడు. పాత నిబంధన చెడ్డది కాదు; గాని ఉత్తమమైనది.

*దేవునిచేత ఇయ్యబడింది.* క్రొత్త నిబంధన గొప్పది అంటే దాని అర్థం పాత నిబంధన దేవునిచేత యివ్వబడినది కాదని కాదు (చూడు నిర్గమకాండము 20). పాత నిబంధనకు దేవుడే గ్రంథకర్త. ఇది కూడ దైవీక బయల్పాటే.

*మిగతా సమకాలీన ధర్మ విధులకంటే శ్రేష్ఠమైనది.* క్రొత్త నిబంధన శ్రేష్ఠమైనది అని చెప్తున్నామంటే, పాత నిబంధన దాని సమకాలీన నిబంధనలకంటే గొప్పది కాదు అని అర్థం కాదు. కొన్ని యితర నిబంధనలున్నాయి. మోషేకు ముందు కూడ అవి ఉన్నాయి. పాత

నిబంధనలో కనబడే కొన్ని విధులు వాటిల్లోనూ ఉన్నాయి. అయితే, పాత నిబంధన కాలంలో మోషే ధర్మశాస్త్రమే మిగతా వాటి కంటే గొప్పది. *దాని ఉద్దేశమును నెరవేర్చింది.*

*క్రొత్త నిబంధన గొప్పది.* అంటే, దాని అర్థం పాత నిబంధన దాని ఉద్దేశమును నెరవేర్చలేదు అని కాదు. మోషే ధర్మశాస్త్రమునకు ఒక ఉద్దేశం ఉంది. "క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను" అని పౌలు చెప్తున్నాడు (గలతీయులకు 3:24) – ఇది తొలగింపబడకముందే తన లక్ష్యమును నెరవేర్చింది. "అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" అని పౌలు వ్రాస్తున్నాడు (గలతీయులకు 3:25).

*నైతిక విధులలో అల్పమైనది కాదు.* క్రొత్త నిబంధన శ్రేష్ఠమైనది అంటే పాత నిబంధనలోని నైతిక విధులు క్రొత్త నిబంధనలోని వాటికంటే అల్పమైనవి అని అర్థంకాదు. నిజానికి పాత నిబంధనలోని నైతిక విధులు (అవశ్యకతలు) మరియు క్రొత్తనిబంధనలోని వాటికి మధ్య ఉన్న తేడా స్వల్పమే! ఈ విషయంలో క్రొత్త నిబంధన చెప్తున్న దానిని మనం అపార్థం చేసుకుంటుంటాము. ఉదాహరణకు, పాత నిబంధన బయటి విషయాల గురించి మాత్రమే పట్టించుకోవడంలేదు. ఉదాహరణకు "నీ పొరుగువానిదేదియు నీవు ఆశింపకూడదు ..." (నిర్గమకాండము 20:17) అన్న ఆజ్ఞను చూడండి.[1] తన శ్రోతలు దీని గురించి ఏం విన్నారు మరియు తాను ఏం చెప్తున్నాడు అన్న వాటి మధ్య భేదమును మత్తయి 5లో ప్రభువు ప్రస్తావిస్తున్నాడు గాని మోషే ధర్మశాస్త్రమునకు విరుద్ధంగా తను బోధించుట లేదు. అంతేగాక రబ్బీలు ఏం బోధించారు మరియు ప్రజలు ఏం నమ్మారు అన్న విషయం తన బోధనకు మధ్య వ్యత్యాసాన్ని ఆయన చూపిస్తున్నారు.

## దీని అర్థం ఏమిటి

శ్రేష్ఠమైన నిబంధనను కలిగియుండడం అంటే అర్థం ఏమిటన్నది గ్రహించుటకు హెబ్రీ గ్రంథకర్త క్రొత్త నిబంధన లక్షణాలు గొప్పవని చెప్తున్న విషయాన్ని గమనించండి.

*గొప్ప ప్రధానయాజకుడు.* క్రైస్తవ యుగంలో, మనకు గొప్ప ప్రధానయాజకుడున్నాడు. ఈ విషయం హెబ్రీయులకు 8వ అధ్యాయం మొదటి భాగంలో చెప్పబడింది (8:1). క్రీస్తునందు మనకు "గొప్ప ప్రధానయాజకుడున్నాడు." ఆయన దేవుని కుడిపార్శ్వమందు ఆసీనుడై నిజమైన గుడారములో పరిచర్య చేస్తున్నాడు. ఆయన పాత నిబంధన యాజకులకంటే భిన్నమైనవాడు (8:1–5). ఆయన యాజకత్వము "శ్రేష్ఠమైనది" (8:6), కాబట్టి ఆయన గొప్ప ప్రధానయాజకుడు (చూడు 7:7–12).

క్రీస్తు ఎందుకని గొప్ప ప్రధానయాజకుడు? ఎందుకంటే ఆయన పరిశుద్ధుడు, నిష్కళంకుడు (7:26, 27; చూడు 4:15). అన్ని సమయములకును తగిన ఒక్క బలిని ఆయన అర్పించాడు (7:27). దైవిక ప్రమాణంచేత ఆయన ప్రధాన యాజకుడయ్యాడు (7:28), మరియు తద్వారా ఆయన నిరంతరము యాజకుడయ్యాడు (7:23–25).

*శ్రేష్ఠమైన నిబంధన.*[2] నేడు మనం శ్రేష్ఠమైన నిబంధన క్రింద జీవిస్తున్నాము (8:6; 7:22). క్రొత్త నిబంధన పాత నిబంధనకంటే శ్రేష్ఠమైనది అని హెబ్రీ పత్రిక స్పష్టం చేస్తుంది. మన నిబంధన లోపముగలది కాబట్టి మనకు క్రొత్త నిబంధన అవసరత ఉందని 8:7, 8లో గ్రంథకర్త వాదిస్తున్నాడు. ఇది ఎలా లోపము గలదిగా ఉంది? దీని విధులు లోపము

గలవి కాదు కానీ దీని అర్పణలు, బలులు పాపములను పూర్తిగా తీసివేయలేకపోయాయి. కాబట్టి, క్రొత్త నిబంధన గురించి చెప్తున్న యిర్మీయా 31:31–34 వాక్య భాగమును గ్రంథకర్త 8:8–12లో ఉదహరిస్తున్నాడు. క్రొత్త నిబంధనలోని విధులు రాళ్ళమీద గాకుండా ప్రజల హృదయాలపై వ్రాయబడతాయి. క్రొత్త నిబంధనలోని ప్రజలు దేవుని ఎరుగునట్లు ఆయన గురించి ప్రత్యేకంగా బోధింపబడనక్కర్లేదు. ఎందుకంటే, ఈ ప్రజలు ఇదివరకే దేవున్ని ఎరిగియుంటారు. ఈ నిబంధనలోనున్న ప్రాథమిక ప్రతిఫలం ఏమిటంటే, "వారి దోషము విషయమై దయగలిగి, వారి పాపములను దేవుడు ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొనడు" (8:12).

పాత నిబంధన బలులు పాపములను తీసివేయలేకపోయాయి (10:4); అయితే క్రొత్త నిబంధన బలి దీన్ని చేసింది. పాపమును తీసివేయలేని పాత నిబంధన అశక్తత దీన్ని "మరణ సంబంధ పరిచర్యగా" (2 కొరింథీయులకు 3:7) చేసింది. దీని నిష్ప్రయోజనము మరియు బలహీనత గురించి మాట్లాడేవిధంగా చేసింది (7:18, 19). క్రొత్త నిబంధన గొప్ప నిబంధన ఎందుకంటే, దీనిలోనున్నవారు క్రీస్తు బల్యార్పణ ద్వారా క్షమించబడియున్నారు.

*శ్రేష్ఠమైన వాగ్దానములు.* క్రొత్త నిబంధన గొప్ప నిబంధన ఎందుకంటే ఇది శ్రేష్ఠమైన వాగ్దానములపై నిర్మించబడింది (8:6). పాత నిబంధన కాలంలో జీవించినవారు దేవుని వాగ్దానముల ఆఖరి నెరవేర్పును చూడలేకపోయారు (11:13; 11:39, 40). వారు వాగ్దానములను చూశారు గాని వాటిని అందుకోలేక పోయారు. మరోవైపు మనం వాగ్దానాలను స్పష్టంగా చూస్తూ వాటిని పొందుకోగలుగుతున్నాము. క్రొత్త నిబంధనను శ్రేష్ఠమైనదిగా చేస్తున్న ఏ వాగ్దానములను మనం పొందుకున్నాము? హెబ్రీయులకు 8:12 ప్రకారం మనకు పాప క్షమాపణను గురించిన నిశ్చయత ఉంది. ఇది పాత నిబంధనలో లేదు. అలాగే, క్రీస్తు మరణమునుబట్టి మనకు "నిత్య స్వాస్థ్యము" అను వాగ్దానం ఉంది (9:15).

*గొప్ప ప్రతినిధి.* ఈ యుగంలో మనకు శ్రేష్ఠమైన ప్రతినిధి ఉన్నాడు. పాత నిబంధనలో దేవుని తరపున మాట్లాడిన ప్రవక్తలకు భిన్నంగా, ఈనాడు దేవుని ప్రతినిధి అయిన దేవుని కుమారుడైన క్రీస్తును చూపిస్తూ హెబ్రీయులకు 1:1, 2 వాక్య భాగం చెప్తుంది. మోషే ధర్మశాస్త్రం ఇయ్యబడుటకు మధ్యవర్తిత్వం చేసిన (2:2); దూతల కంటే ఆయన గొప్ప ప్రతినిధి (1:4), ఆ ధర్మశాస్త్రమును అందించిన మోషే కంటెను (3:3–6) ఆయన గొప్పవాడు.

*శ్రేష్ఠమైన నిరీక్షణ.* ఇప్పుడు మనకు గొప్ప నిరీక్షణ ఉంది (7:19). ఎందుకు మన నిరీక్షణ గొప్పది? ఎందుకంటే "ఇది తెరలోపల ప్రవేశించుచున్నది" (6:18–20). మన నిరీక్షణ పరలోక బహుమానమునకు సంబంధించియుంటుంది. పాత నిబంధనలోనున్న వారికి ఏ నిరీక్షణ ఉండేది? ప్రాథమికంగా వారి నిరీక్షణ ఈ లోకపు వాటిపైనే, వాగ్దానాల పైనే ఉండేది. ఒక్కోసారి దేవునితో నిత్య సహవాసం గురించి నిరీక్షణ అస్పష్టంగా ఉండేది (చూడు 11:16, 35), కానీ ఇందుకు భిన్నంగా మనకు స్పష్టమైన పరలోకపు వాగ్దానాలున్నాయి. పరలోకంలో మనకు "గొప్ప స్వాస్థ్యం" ఉంది (10:34).

*శ్రేష్ఠమైన అర్పణ.* క్రొత్త నిబంధనను శ్రేష్ఠమైనదిగా చేస్తున్న ప్రాముఖ్య విషయం ఇందులోని శ్రేష్ఠమైన అర్పణ (9:23). జంతువుల బల్యార్పణ శారీరక పవిత్రతను అనగా ఆచారబద్ధ శుద్ధతను ఇచ్చింది అని 9:13, 14 చెప్తుంది. అయితే క్రీస్తు రక్తము ఇంతకంటే ఎక్కువే చేసింది. ఇది మనస్సాక్షిని పవిత్రపరచి మన పాపములను క్షమిస్తుంది. క్రీస్తుని క్రొత్త

నిబంధన బలి శక్తిగలది. ఇది పాపములను తీసివేస్తుంది (చూడు 9:13, 14; 10:4, 14). ఇది ఒక్కసారే అర్పించబడింది (7:27; 9:25, 26; చూడు 12:24).

*శ్రేష్ఠమైన గుడారము.* క్రైస్తవ్యంలో మనకు గొప్ప గుడారము ఉంది. ఇది "మనుష్యుడు గాక" దేవుడే ఏర్పరచిన నిజమైన గుడారము (8:2, 5; చూడు 9:11, 24; 10:1). పాత గుడారము "నిజమైన గుడారము" యొక్క ఛాయరూపము అని లేఖనములు చెప్తున్నాయి. ఈనాడు దేవుని ప్రజలు ఆయన్ను ఆరాధించే గొప్ప గుడారము ఆయన సంఘము.

## గొప్ప నిబంధన మన జీవితాలకు ఎలా అన్వయించబడుతుంది?

*పాత నిబంధన రద్దుచేయబడడం.* మనకు క్రొత్తదైన శ్రేష్ఠమైన నిబంధన ఉంది కాబట్టి పాత నిబంధన తీసివేయబడింది. రెండు నిబంధనలను పోలుస్తూ హెబ్రీ గ్రంథకర్త 8:13లో యిలా ముగిస్తున్నాడు: "ఆయన 'క్రొత్త నిబంధన' అని చెప్పుటచేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది." క్రీస్తునకు దాదాపు ఐదువందల యేళ్ళ ముందే యిర్మీయా పాత నిబంధన "అదృశ్యమవుతుందని" ప్రవచించాడు. క్రొత్త నిబంధన కాలమునకెల్ల ఇది తీసివేయబడిందని దైవప్రేరేపిత గ్రంథకర్తలు గ్రహించారు (ఉదాహరణకు చూడు హెబ్రీయులకు 7:11, 12). కాబట్టి, మనకు నేరుగా అన్వయింపచేసుకొనుటకు కావలసిన ఆజ్ఞలకొరకు మనం పాత నిబంధనలో వెతకకూడదు. అలాగే పాత నిబంధన కాలంలో చేసినవాటితో మన మత సంబంధమైన ఆచారములను నిరూపించుకొనకూడదు.

*నమ్మకత్వమునకు ప్రోత్సాహం.* మనం శ్రేష్ఠమైన నిబంధన క్రింద జీవిస్తున్నాం కాబట్టి మనం కృతజ్ఞత కలిగియుండాలి. వారు శ్రేష్ఠమైన నిబంధన క్రింద ఉన్నందుకు వారు అనుభవిస్తున్న ఆశీర్వాదములను గుర్తు తెచ్చుకుని వారు నమ్మకస్థులై యుండి వారి ఒప్పుకోలును గట్టిగా చేపట్టాలని గ్రంథకర్త తన పాఠకులను ప్రోత్సహిస్తున్నాడు. మనము కూడ శ్రేష్ఠమైన నిబంధన క్రింద ఉన్నాము కాబట్టి మన ప్రభువునకు లోబడి నమ్మకస్థులమైయుండునట్లు ప్రోత్సహించబడుతున్నాము. పాత నిబంధనలోని విధులకంటే ఇంకా ఎక్కువగా చేయకలుగునట్లు మన కృతజ్ఞత మనలను ప్రోత్సహిస్తుంది.

*గొప్ప శిక్షావిధి.* మనకు ఇయ్యబడిన గొప్ప ఆశీర్వాదాలు మనమీద గొప్ప బాధ్యతలున్నాయని గుర్తు చేస్తుంటాయి. క్రొత్త నిబంధనకు మనం లోబడియుండకపోతే, పాత నిబంధనకు విధేయులైనవారు ఎదుర్కొన్న శిక్షావిధికంటే మరింత గొప్ప శిక్షావిధికి గురవుతాము (10:26-29; 2:2, 3).

## ముగింపు

మోషే ధర్మశాస్త్రము అప్పటి వారిని ఎంతో భయభక్తులు, సమర్పణ కలిగి యుండేలా చేసింది. దేవుడు ఇశ్రాయేలీయులకు యిచ్చిన నిబంధనకు అవిధేయత చూపుటకు, ధర్మశాస్త్రమునకు తిరస్కారము చూపుటకును ఎంతోమంది ఒత్తిడి చేయబడి, బెదరింపబడినా ఎంతోమంది ఇశ్రాయేలీయులు బెదరలేదు. ఇందు కోసం వారు తమ ప్రాణాలను సహితం వదులుకున్నారు (చూడు 11:32-38). బలహీనమైన ధర్మశాస్త్రమే ఇటువంటి సమర్పణను కోరుకుంటే, శ్రేష్ఠమైన క్రొత్త నిబంధన పట్ల మరి ఇంకెంతటి

సమర్పణను మనం కలిగియుండాలి!

---

సూచనలు

[1]తన సహోదరుని తిరస్కరించడం లేదా అతని యెడల ద్వేషం కలిగియుండడమును ధర్మశాస్త్రం నిషేధిస్తుందన్న విషయాన్ని పరిశీలించండి. (చూడు లేవీయకాండము 19:17, 18.) [2]పాత నిబంధనకంటే క్రొత్త నిబంధన శ్రేష్ఠమైనదని తెలిపే భేదమును గురించి చూడండి హెబ్రీయులకు 12:18–24.